క్లుప్తంగా

99 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ శనివారంతో 99 శాతంతో ముగిసింది. మొత్తం 16 సచివాలయాల పరిధిలో 9193 మందికి గాను రూ.2,53,46,250లు పంపిణీ చేయాల్సి ఉంది. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తుండటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వేలిముద్రలు పడని లబ్ధిదారుల ఇళ్లకు ఆయా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు వెళ్లి వారి ఐరిష్ వేసి పింఛను నగదు అందిస్తున్నారు. ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



రొంపిచర్ల: మండలంలో వడ్లమూడి వారిపాలెం గ్రామానికి చెందిన మేలింగి రమేష్ అనే యువకుడు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను శనివారం గ్రామ సర్పంచ్ గానుగపంట ఉత్తమరెడ్డి పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకటరెడ్డి, గ్రామ పెద్దలు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాగు అక్రమ తవ్వకాల పరిశీలన

నరసరావుపేట రూరల్: మండలంలోని ములకలూరు గ్రామంలో కుప్పగంజివాగు వెంట చోటు చేసుకున్న మట్టి తవ్వకాల ప్రదేశాన్ని తహసీల్దార్ ఆర్‌వీ రమణానాయక్ శనివారం పరిశీలించారు. వాగును ఒక సొరంగం లాగా తవ్వి కోట్లాది రూపాయల మట్టిని తరలించిన వారిపై వెంటనే విచారణ జరిపి, చట్టపరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ప్రభుత్వానికి నష్టపరిహారం చెల్లించే విధంగా చూడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆర్డీవోకు చేసిన ఫిర్యాదుపై తహసీల్దార్ స్పందించారు. సదరు మట్టి తవ్వకాలపై నివేదిక తయారు చేసి ఆర్డీవోకు సమర్పిస్తామని, త్వరలో సదరు ప్రదేశాన్ని ఆర్డీవో పరిశీలిస్తారన్నారు. మైనింగ్ చేసిన వారిపై విచారణ నిర్వహించి ప్రభుత్వపరంగా తగుచర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దార్ వెల్లడించారు. ఆయన వెంట మండల సర్వేయర్ సుభాని, ఇప్పప్పాలెం, ములకలూరు గ్రామ వీఆర్వోలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

వేల్పూరులో తుదిదశకు రీసర్వే పనులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు రెవెన్యూ పరిధిలో గ్రామాల్లో రీసర్వే పనులు త్వరితగతిన అయ్యేలా చర్యలు చేపట్టామని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ వేల్పూరు రెవెన్యూ గ్రామ పరిధిలో 5520 ఎకరాలు విస్తీర్ణం ఉండగా రీసర్వే పనుల్లో భాగంగా రోవర్ ఆధునిక యంత్ర పరికరాలు ద్వారా రైతుల సమక్షంలో భూముల కొలతలు తీశామన్నారు. అనంతరం 2600 మంది రైతులకు నోటీసులు అందజేశామన్నారు. అందులో ఐదు మంది రైతుల నుంచి అభ్యంతరాలు తెలియజేయగా సమస్య సత్వరమే పరిష్కరించామన్నారు. రికార్డు పనుల్లో భాగంగా గత మూడు రోజుల నుంచి 24 గంటల పాటు రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో 11 మంది రెవెన్యూ సిబ్బంది సారథ్యంలో రికార్డు పనులు ముమ్మరంగా చేస్తున్నామన్నారు. రికార్డు పూర్తి కాగానే తదుపరి నరసరావుపేట ఆర్డీవో కార్యాలయానికి నివేదికను అందజేస్తామన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, ఆర్ఐ పి.నాసరయ్య, వీఆర్వోలు శ్రీనివాసరావు, వీరవల్లి వెంకట నాగ సంతోష లక్ష్మి సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మహిళపై దాడి ఘటనలో కేసు నమోదు

చిలకలూరిపేటటౌన్: పాత గొడవల నేపథ్యంలో మహిళపై దాడిచేసిన సంఘటన శనివారం వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన చల్లా తిరుపతమ్మ, భర్త చిన్న అంకమ్మకు వారి ఇంటిపక్కన ఉండే గోరంట్ల గోపికి ఇంటి సరిహద్దు వివాదం ఉంది. ఈ నేపథ్యంలో జులై 30వ తేదీ రాత్రి గోరంట్ల గోపి, మరో ఐదుగురు వ్యక్తులు కలసి చల్లా తిరుపతమ్మపై దాడి చేశారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత కంటి పరీక్షలు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శనివారం పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. గత నెలలో జరిగిన ఉచిత కంటి మెగా వైద్యశిబిరంలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 400 మందికి శంకర కంటి ఆస్పత్రి వైద్యులు కంటిపరీక్షలు నిర్వహించి ఉచితముగా కళ్లజోళ్లు, కంటి డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వడాల చక్రారెడ్డి, రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సభ్యులు వడాల జగన్మోహన్ రెడ్డి, వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రకృతి సిద్ధంగా పంటల సాగు

- రసాయనాలు వాడకుండా..
- ఆకుకూరలు, కూరగాయలు, పండ్లసాగు
- లాభాపేక్ష లేకుండా విక్రయాలు

చిలకలూరిపేట: స్థానిక కూరగాయల మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారం చేసే నాగభూషణంకు రైతులతో విస్తృత పరిచయాలు ఏర్పడ్డాయి. దీంతో కూరగాయల సాగుపై ఆసక్తి పెరిగింది. అయితే రసాయనిక ఎరువులతో కాకుండా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ విధానంలో కూరగాయలు, పండ్లు సాగు చేయాలని సంకల్పించాడు. దీనితో ప్రకృతి వ్యవసాయ నిపుణుడు సుభాష్ పాలేకర్ రచనలు, వీడియోలు అధ్యయనం చేశాడు. దీనికి తోడు ఎక్కడ ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్నారో తెలుసుకొని ఇతర ప్రాంతాల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి వచ్చాడు. అంతే! చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని రెండేళ్లుగా సహజసిద్ధ రీతిలో ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుమందులు ఉపయోగించకుండా ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు పండిస్తున్నాడు. నేలకు కావల్సిన బలం కోసం గో ఆధారిత ఎరువుల విధానం అనుసరిస్తున్నాడు. దీనికి నిమిత్తం ఆవులను పెంచటానికి వాటిని అవసరమైన మేత కోసం మరో మూడు ఎకరాల్లో పశుగ్రాసాన్ని సాగు చేస్తున్నాడు.

ద్రవ, ఘన జీవామృతాలతో..

రసాయనిక ఎరువులకు బదులుగా ఆవుపేడ, గో పంచకం, నల్లబెల్లం, శనగ లేదా ఉలవపిండి, పొలంగట్టు మట్టితో తయారు చేసిన ద్రవజీవామృతం ఎరువుగా వాడతారు. వీటి మిశ్రమాన్ని మూడు రోజుల పాటు డ్రమ్ముల్లో నిల్వచేసి కలియబెట్టి సహజ ఎరువును రూపొందించుకుంటారు. దీనినే భూమికి బలంగా వాడతారు.



ప్రకృతి వ్యవసాయపద్ధతిలో పండించిన క్యారెట్, ముల్లంగి, సొర



ద్రవ జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

పురుగు మందులకు బదులుగా కషాయాలు..

ఇక్కడ పురుగు మందులకు బదులుగా వేప, కానుగ, జిల్లేడు, బొప్పాయి, పిచ్చితులసి ఆకులు, గోపంచకంలో నానబెట్టి ఉడకబెడతారు. ఒక రోజు చల్లార్చాక వడకట్టి కషాయం రూపొందిస్తారు. లీటరు కషాయన్ని 10 లీటర్ల నీటిని కలిపి పంటలపై పిచికారీ చేస్తారు.

సాగు చేస్తున్నవి...

ఆకుకూరల్లో తోటకూర, పాలకూర, మెంతికూర, చుక్కకూర, కొత్తిమీర, పాదిన, కూరగాయల్లో మునగ, కీర, క్యారెట్, టమాటా, వంకాయలు, బెండకాయలు, దొండకాయలు, పచ్చిమిర్చి, చిక్కుడు, పొట్ల, సొర, ముల్లంగి, క్యాబేజీ, క్యాలిఫ్లవర్ సాగు చేస్తున్నాడు. వీటితో పాటుగా బొప్పాయి, జామ, సపోటా,ఆపిల్‌బెర్రీ, అరటిపండ్లను పండిస్తున్నాడు.

ఎద్దుగానుగ నూనెలు...

కూరగాయలు, ఆకుకూరలకు తోడు శనగనూనె, కొబ్బరినూనె, నువ్వుల నూనె ఎద్దు గానుగ ద్వారా తయారు చేస్తున్నారు. నూనెలు యంత్రాల ద్వారా తయారు చేస్తున్నప్పుడు పుట్టే వేడి కారణంగా సహజపోషకాలు కోల్పోతాయని, నెమ్మదిగా తిరిగే ఎద్దు గానుగ ద్వారా పూర్తి పోషకాలు లభిస్తాయని, రసాయనాలు కలవని స్వచ్ఛమైన నూనెలు తయారు చేస్తున్నట్లు నాగభూషణం తెలుపుతున్నాడు.

ఆసక్తి పెంచుకోవాలి



రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల ఆసక్తి పెంచుకోవాలి. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ప్రకృతి వ్యవసాయం చేయడంతో పాటు రైతుల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ఈ నెల ఒకటో తేదీన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 200 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల వ్యవసాయాధికారులతో పండ్లు, కూరగాయలు, మిరప సాగుపై అవగాహన శిబిరం నిర్వహించాం. మా వ్యవసాయ క్షేత్రంలో పండిన ఉత్పత్తులను లాభాపేక్ష లేకుండా విక్రయిస్తున్నాం.

– గుడిపల్లి నాగభూషణ, ప్రకృతి వ్యవసాయదారు

ఖర్చు తక్కువ



రైతులు రసాయనిక ఎరువులు, పురుగు మందులకు వెచ్చిస్తున్న ఖర్చుతో పోల్చితే ఘన, ద్రవజీవామృతాలు, కషాయాలు చాలా తక్కువ ఖర్చుతో రూపొందించుకోవచ్చు. రసాయనాల వాడకం వల్ల భూములు సారం కోల్పోతున్నాయి. మిరప వంటి పంటలకు విపరీతంగా ఖర్చులు పెరిగాయి. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూములను సారవంతం చేసుకోవచ్చు. అంతర్‌పంటల సాగు ఎంతో లాభాలు చేకూరుతుంది. ప్రకృతి వ్యవసాయం చేసే వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తాం.

–కె అమలకుమారి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

గ్రంథాలయంలో చైర్మన్ తనిఖీ



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు గ్రామంలో గల శాఖా గ్రంథాలయాన్ని శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను, పుస్తకాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. సిబ్బంది సమయపాలన పాటించి, పాఠకులకు, గ్రామస్తులకు, విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. తీరిక సమయాల్లో గ్రామస్తులు గ్రంథాలయాల వద్దకు వచ్చి పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించు కోవాలన్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీ లక్ష్మీ, గ్రంథాలయాధికారి కె.వెంకట్రావు పాల్గొన్నారు.

ఈపూరులో...

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరు గ్రామంలో గల శాఖ గ్రంథాలయాన్ని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మిలు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాలు, రికార్డులను పరిశీలించి గ్రంథాలయ అధికారి జి. శ్రీనివాసరావుకు తగిన సూచనలు చేశారు.

ర్యాగింగ్ చేసి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దు

విద్యార్థినులకు సూచించిన ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి

నరసరావుపేట రూరల్: కళాశాలల్లో తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేసి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్ హెచ్చరించారు. స్థానిక కేసానుపల్లి గ్రామ సమీపంలోని కృష్ణవేణి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలు, ర్యాగింగ్ చేయడం వల్ల విధించబడే శిక్షలుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య మాట్లాడుతూ విద్యార్థులు స్నేహ భావంతో మెలగాలని, జూనియర్లకు సీనియర్లు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామ శేషగిరిరావు మాట్లాడుతూ కళాశాలలో సీనియర్లు జూనియర్లు అనే బేధభావం లేకుండా అందరూ కలిసిమెలిసి ఒక కుటుంబం మాదిరిగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రామారావు మాట్లాడుతూ ఈ కళాశాలలో ఇంతవరకు ర్యాగింగ్ అనేది జరగలేదని ర్యాగింగ్‌ని నిరోధించేందుకు కావల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నామని, విద్యార్థులకు వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు మహిళా కౌన్సిలర్‌ని ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ప్రముఖ మానసిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ పార్ధసారథి రాజు, సోషల్ వర్కర్ డేవిడ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఆశీర్వాదం పాల్, కళాశాల ప్రతినిధులు

ఆ ఏడుగురి స్నేహానికి సిల్వర్‌జూబ్లీ!

నరసరావుపేట రూరల్: ఈ లోకంలో అద్భుతమైనది స్నేహం. పేద, ధనిక హెచ్చు తగ్గులు, కులమత తారతమ్యం లేనిది అదొక్కటే. ఈ లోకంలో మంచి స్నేహితులకు మించిన ఆస్తిలేదు. కష్టంమొచ్చినా, ఆనందం వచ్చినా మొదట గుర్తుకువచ్చే వాడు నిజమైన స్నేహితుడు. కష్టంలో, బాధలో స్నేహితుడు ఏమిచేయకున్న ప్రక్కన నిలబడితే కొండంత ధైర్యం. అలాంటి స్నేహం కలకాలం నిలుస్తుంది. అలాంటి ఓ స్నేహబంధం ఓ వరం. 1998లో వివిధ ప్రాంతాల నుంచి నరసరావుపేటకు వచ్చి ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో చేరి చక్కగా చదువుకొని వివిధ వృత్తుల్లో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఈ ఏడుగురి స్నేహబంధం నేటికి 25 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ ఏడుగురు శనివారం నరసరావుపేటలో సమావేశమై తమ సిల్వర్ జూబ్లీ స్నేహితుల దినోత్సవం నిర్వహించుకున్నారు. ఆ ఏడుగురు స్నేహితులు ముప్పాళ్లలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న వి.సాంబనాయక్, శ్యానిటరీ సెక్రెటరీలు ఎ.శ్యామ్, ఒ.మాణిక్యరావు, నార్నెపాడు జెడ్పీ హైస్కూలు స్కూలు అసిస్టెంట్ కె.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు బి.ప్రశాంత్ కుమార్, ఉపాధ్యాయులు వి. రామకృష్ణ, డాక్టర్ ఎ. వెంకట నరసు స్నేహితుల దినోత్సవం జరుపుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సంగీతంలో సప్తస్వరాలు స రి గ మ ప ద ని స లు మాదిరిగా మా స్నేహం కలకాలం ఉండాలని వారు ఆకాంక్షించారు.



పట్టణంలో సిల్వర్ జూబ్లీ నిర్వహించుకున్న ఏడుగురు స్నేహితులు

బీఎల్‌వో విధులకు పిలవొద్దు

జిల్లా జాయింట్ కలెక్టర్‌కు విన్నవించిన అంగన్వాడీలు

నరసరావుపేట: ఇప్పటికే యాప్‌ల భారం, రికార్డులు రాయడం వంటి పనులతో మానసిక ఒత్తిడికి గురవుతున్న అంగన్వాడీలను బీఎల్‌ఓ విధులకు హాజరు కావాల్సిందేనని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేయడం తగదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మల్లేశ్వరి అన్నారు. అంగన్వాడీలకు బీఎల్‌ఓ డ్యూటీలకు మినహాయించాలని కోరుతూ మాచవరం మండలం పిన్నెల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీలతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలిశారు. విధి నిర్వహణలో అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. అనంతరం మల్లేశ్వరి మాట్లాడుతూ గతంలో అంగన్వాడీలు బీఎల్‌ఓ డ్యూటీలు చేశారని, ఆ క్రమంలో రాజకీయ వేధింపులు, ముఠా తగాదాలతో అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌ఓ విధులు రద్దు వేయడం జరిగిందన్నారు. విధులకు హాజరుకాని అంగన్వాడీలను ఇష్టానుసారం అధికారులు మాట్లాడ వద్దని కోరారు.

9న జాతీయ లోక్‌అదాలత్

చిలకలూరిపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9 తేదీ బుధవారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి చెప్పారు. రాజీపడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెక్ బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని పట్టణంలోని రెండు న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ పడదగిన కేసులను పరిష్కరించు కోవాలని సూచించారు.

పారిశ్రామిక సందర్శనకు జేఎన్‌టీయూ-ఎన్ విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులకు తరగతి గది బోధనతోపాటు ప్రత్యక్ష పరిశీలన ద్వారా విజ్ఞానం పెరుగుతుందని జేఎన్‌టీయూ-ఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్.శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల మెకానికల్ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులు శనివారం అనంతపురంలోని దక్షిణాది రీజియన్ ఫార్మ్ మెషినరీ ట్రైనింగ్ అండ్ టెస్టింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు తరలివెళ్లారు. ఆరు రోజుల పాటు వివిధ అంశాలపై సంస్థలో ప్రత్యక్ష పరిశీలన ద్వారా శిక్షణ పొందనున్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.శోభన్‌బాబు, మెకానికల్ విభాగాధిపతి ఐ.శ్రీఫణి సుష్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రేపు చేనేతపై విద్యార్థులకు పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 7వతేదిన సెలెబ్రేటింగ్ ఇండియన్ హ్యాండ్లూమ్స్-వీవింగ్ అవర్ కల్చర్ హెరిటేజ్ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈమేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఘనంగా అజాదీకా అమృత్ మహోత్సవ్

క్రోసూరు: అజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకలు ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని ఎంపీడీవో బి. మహేష్ శనివారం తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్నందున పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో అజాదీకా అమృత్‌మహోత్సవ్ వేడుకలు ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహించాలన్నారు. ప్రతి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రధాని ప్రకటించిన దేశభక్తి మాటలతో శిలాఫలకం ఏర్పాటు చేయటం, అదేవిధంగా స్వాతంత్ర్యం పోరాటంలో అమరులైన వారిని స్మరించుకోవటం, మొక్కలు నాటటం, దేశభక్తి పెంపొందించే ప్రతిజ్ఞ చేపట్టటం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు ఈ వేడుకలు నిర్వహించేందుకు తగు విధంగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాలతో చెరువులు నిండుగా..



శావల్యాపురం: సాగర్ జలాలతో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపినట్లు ఎన్నెస్పీ ఏఈ పోట్లూరు లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం శావల్యాపురంలో మంచినీటి చెరువును ఎన్నెస్పీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేయగా మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 8 మంచినీటి చెరువులను పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎన్నెస్పీ అధికారులు సమన్వయంతో సాగర్ జలాలతో నింపామన్నారు. అనంతరం శావల్యాపురం మంచినీటి చెరువును సందర్శించి తాగునీటి సామర్థ్యం పరిశీలించారు. ఆయనతో పాటు ఎన్నెస్పీ లస్కర్ నంద కిషోరు ఉన్నారు.

రేపు శావల్యాపురంలో డీవార్మింగ్



శావల్యాపురం: డీవార్మింగ్ కార్యక్రమాన్ని సోమవారం అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో విజయవంతం చేయాలని ఏంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నీ ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులకు డీవార్మింగ్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్ పాల్గొని మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో 6700 మంది విద్యార్థులు గుర్తించామని వీరందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం వైద్య ఆరోగ్య అధికారులు సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలో అల్‌బెండజోల్ మందుబిళ్లలు మింగిచాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులకు ఆల్‌బెండ్‌జోల్ మందు బిళ్లలు బాక్సులు అందజేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, సూపర్‌వైజరు సాయిగీతా, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు,ఏలికా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ములకలూరులో తల్లిపాల వారోత్సవాలు



గ్రామస్తులకు ఆయుర్వేద మందులను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

వినుకొండ (నూజెండ్ల): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా నూజెండ్ల మండలం ములకలూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ఆర్. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వాలని, ముర్రుపాలు బిడ్డకు సంపూర్ణ విటమిన్స్, పోషకాలు, రోగనిరోధక శక్తి అందుతుందన్నారు. 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే బిడ్డకు ఇవ్వాలని అన్నారు. అనంతరం రూ.4 వేల విలువైన అయుర్వేద మందులను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వనజ,అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, సిబ్బంది గంగమ్మ, ఆశలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన కల్పించాలి

పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమల కుమారి

యడ్లపాడు: భూసారం తగ్గిపోవడానికి విచక్షణా రహితంగా రసాయనాలే కారణమని.. ఫలితంగా ఆ ప్రభావం పంట దిగుబడులపై పడుతుందని ప్రకృతి సాగు విధానం పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామం రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి సాగుపై రైతులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. సేర్ఫ్, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ ప్రకృతి సాగుపై మహిళా సంఘాలు తమ గ్రూపు సభ్యులకు వివరించాల్సిన బాధ్యత గ్రూపు లీడర్లపై ఉందన్నారు. ఆవు పేడ, మూత్రం, పలు రకాల ఆకులతో తయారు చేసిన నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిస్త్రం, కషాయాలు పంటలపై పిచికారీ చేసి ఆరోగ్యకరమైన ఉత్పత్తుల సాగుతోనే రైతులకు అధిక లాభాలు సిద్ధిస్తాయన్నారు. మూస పద్ధతి ప్రకారం రసాయన ఎరువుల్ని వాడకుండా సాగులో సహజ సిద్ధమైన ఎరువుల్ని వినియోగించాలని సూచించారు. ఆకుకూరలు, పండ్లు, దుంపజాతి, తీగ జాతి, కూరగాయలను ఇంటి పరిసరాల ప్రాంతంలో ఖాళీగా ఉన్న రెండు లేదా మూడు సెంట్లలో ప్రకృతి విధానంతో సాగు చేసేందుకు అందరూ ఆసక్తిని చూపాలన్నారు. ఇటువంటి సాగులో నెలకు రూ.3 వేల ఆదాయం పొందే వీలుందన్నారు. పల్నాడు జిల్లా అడిషనల్ డీపీఎం ప్రేమ్‌రాజు మాట్లాడుతూ ప్రపంచానికి ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించటమే లక్ష్యమే ప్రకృతి వ్యవసాయ నినాదమన్నారు.

ప్రతి గ్రామంలోనూ ప్రకృతి సాగయ్యేలా అంతా కృషి చేయాలన్నారు. మిరప పంటలో రక్షక పంటలుగా జొన్న మొక్కజొన్న, సజ్జ, అలాగే మిరపలో అంతర పంటలుగా ఉల్లి, క్యారెట్, బీట్ రూటు ఆకు కూరలు, ముల్లంగి వేయాలని సూచించారు. అనంతరం వారు గ్రామంలోని ఎఫ్‌పీవో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జీవన్, సీసీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమల కుమారి

ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలంటూ వినతి

చిలకలూరిపేట: రద్దు చేసిన ఆర్టీసీ సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మురికిపూడి ప్రసాద్ కోరారు. శనివారం ఈ మేరకు ఆర్టీసీ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో విజయవాడ రూట్‌కు సంబంధించిన కొన్ని ఆర్టీసీ బస్సులు అధికారులు రద్దు చేయడం జరిగిందని తెలిపారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులపై మాత్రమే ప్రయాణికులు ఆధారపడాల్సి వస్తుందని చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే గుంటూరు, విజయవాడ రూట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేయడం ఎంతో అనాలోచిత చర్యగా వెల్లడించారు. ఈ డిపోకు సంబంధించిన బస్సులను ఇతర డిపోలకు తరలించి నియోజకవర్గానికి సంబంధించిన ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. బస్సు సర్వీసుల రద్దు కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు నిత్యం పనుల మీద వెళ్లే వారు సకాలంలో బస్సులు అందక గంటల కొద్ది వేచి ఉండాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఆర్టీసీ అధికారులు తగు దిద్దుబాటు చర్యలు చేపట్టి రద్దు చేసిన బస్సులను పునరుద్ధరించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. డిపో మేనేజర్ అందుబాటులో లేకపోవడంతో సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రవినాయక్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ర్యాగింగ్ భూతాన్ని అంతమొందించాలి

సత్తెనపల్లి: ర్యాగింగ్ పెనుభూతాన్ని అంతమొందించటానికి ప్రతి విద్యార్థి నడుం బిగించాలని మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్ హుస్సేన్ అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థాన ఆదేశాల మేరకు కంటెపూడి సమీపంలోని నలందా ఇంజినీరింగ్ కళాశాలలో సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ నిరోధక చట్టం గురించి అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ముందుగా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు సభా పరిచయం చేశారు. సదస్సుకు ముఖ్య అతిథిగా జడ్జి తౌషీద్ హుస్సేన్ విచ్చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడితే పర్యావసానం ఎలా ఉంటుంది. శిక్షలు ఎలా ఉంటాయో వివరించారు. సత్తెనపల్లి ఏజీపీ బాలి సైద్ మాట్లాడుతూ ప్రతి కళాశాలలో విధిగా ర్యాగింగ్ చట్టానికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని, ర్యాగింగ్ నిరోధక కమిటీ వేయాలని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది దివ్వెల శ్రీనివాసరావు సభా అధ్యక్షుడిగా వ్యవహరించారు.

సదస్సులో ప్యానల్ న్యాయవాది బీఎల్ లక్ష్మీకోటేశ్వరరావు, న్యాయవాది గంటా వెంకటశివ, సంఘ సేవకులు ప్రొఫెసర్ వెలుగురి సుబ్బారాయుడు, సత్తెనపల్లి రూరల్ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఆవుల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి తౌషీద్ హుస్సేన్